# భారత్... ఫిస్కల్ విధానం

**తిరోగమన కాలంలో నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో ద్రవ్య విధానం విఫలమవడం, సమష్టి డిమాండ్ పెంపుదలలో ప్రభుత్వ వ్యయం, పన్నుల విధానం ప్రాధాన్యం సంతరించుకోవడంతో కోశ విధాన పరిధి పెరిగింది. మొత్తం ఉత్పత్తిలో సంభవించే ఒడిదుడుకులను నియంత్రిస్తూ అధిక ఆర్థిక వృద్ధి సాధించడంలో కోశ విధాన పాత్ర కీలకమైంది.**



వనరుల సమర్థ వినియోగం ద్వారా పెట్టుబడులను ప్రోత్సహించేదే అభిలషణీయమైన కోశ విధానం (ఫిస్కల్ పాలసీ). ఫలితంగా ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుంది. ఆదర్శవంతమైన పన్నుల విధానం ఆదాయ పంపిణీలో అసమానతల్ని తొలగిస్తుంది. కోశ విధానంలో భాగంగా సమాచార రంగం,నీటిపారుదల, విద్యుత్‌లపై పెట్టుబడులు మౌలిక సౌకర్యాల మెరుగుదలకు దోహదపడి ఆర్థికాభివృద్ధికి దారితీస్తాయి. వ్యాపార చక్రాల వల్ల కలిగే ప్రభావాలను నియంత్రిస్తూ ధరల స్థిరత్వం సాధించడానికి కోశ విధానం ఉపకరిస్తుంది. కోశ విధానంలో భాగంగా ప్రభుత్వం తన వ్యయ, రాబడి కార్యక్రమాలను జాతీయాదాయం, ఉత్పత్తి, ఉద్యోగితలపై అనుకూల ప్రభావాలు చూపే విధంగా రూపొందిస్తుంది. వనరుల సమర్థ పంపిణీ, వాటి యాజమాన్యంపై ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఆధారపడి ఉంటుంది. Incremental capital output ratio (ICOR) భవిష్యత్ వృద్ధి ధోరణులకు ముఖ్య సూచిక. ICOR ఎక్కువైతే ఆ ఆర్థిక వ్యవస్థలో సమర్థత తక్కువని భావించవచ్చు. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ICOR ఎక్కువగా ఉన్నందున దీని తగ్గుదలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నిష్పత్తిలో తగ్గుదల లక్షిత వృద్ధి సాధనకు అవసరమైన కొత్త వనరుల అవసరాన్ని తగ్గిస్తుంది. ప్రభుత్వం అవలంబించే కోశ విధానం ఈ నిష్పత్తి తగ్గుదలకు దారి తీసి సమర్థత పెంచే విధంగా ఉండాలి. ఆశించిన రీతిలో ఆర్థిక వ్యవస్థను నియంత్రించి తద్వారా ఆర్థిక వృద్ధిని, సమానతను, ఆర్థిక స్థిరీకరణను సాధించే ప్రక్రియగా కోశ విధానాన్ని భావించవచ్చు.

### కోశ విధానం – సాధనాలు – లక్ష్యాలు

ప్రభుత్వ ఆదాయ, వ్యయ విధానాల మొత్తం ప్రభావం ఆదాయం, ఉత్పత్తి, ఉద్యోగితపై ఎలా ఉంటుందో తెలియజేసేదే కోశ విధానం. దీనిలో ముఖ్యంగా వ్యయ, పన్ను, రుణ, లోటు విత్త విధానాల ద్వారా ప్రభుత్వం అనుకున్న రీతిలో ఆర్థిక వ్యవస్థను నియంత్రించి వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి, అసమానతల నిర్మూలనకు, ధరల స్థిరీకరణకు తోడ్పడి సమాజ శ్రేయస్సుని గరిష్ఠం చేసే ప్రయత్నం చేస్తుంది.

కోశ విధాన సాధనాలు ముఖ్యంగా1) పన్ను విధానం 2) ప్రభుత్వ వ్యయ విధానం 3) ప్రభుత్వ రుణ విధానం 4) లోటు బడ్జెట్ విధానం. వీటి ద్వారా మన దేశంలో కోశ విధాన లక్ష్యాల సాధనకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

వనరుల సమీకరణ, ఆర్థికాభివృద్ధి సాధించడం, ఆదాయ అసమానతలు తగ్గించడం, పూర్ణోద్యోగిత సాధించడం, ధరల స్థిరత్వం కోశ విధానం లక్ష్యాలు. పెట్టుబడికి అవసరమైన నిధులను ప్రభుత్వం రెండు విధాలుగా సమీకరిస్తుంది. అవి 1) స్వచ్ఛంద పొదుపు 2) నిర్బంధ పొదుపు. ప్రజల నుంచి రుణాలు, పన్నుల ద్వారా వనరుల సమీకరించవచ్చు. తలసరి ఆదాయాలు తక్కువ అవడంతో స్వచ్ఛంద పొదుపు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాధాన్యం సంతరించుకోలేక పోయింది. కొత్త పన్నుల విధింపు, ప్రస్తుత పన్ను రేట్ల పెంపు ద్వారా ప్రభుత్వం ఎక్కువ వనరులను సమీకరించుకోగలదు.

సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించడానికి కోశ విధానం దోహదపడుతుంది. ఆదాయ అసమానతల్ని తగ్గించడానికి ధనిక వర్గాలు, విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై ఎక్కువ పన్ను విధించాలి. తద్వారా వచ్చిన రాబడి బలహీన వర్గాల అభ్యున్నతికి ఉపయోగిస్తే సంపద పునఃపంపిణీ సాధ్యమవుతుంది. మౌలిక సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం చేసే వ్యయం, పెట్టుబడి అవకాశాల విస్తరణ, కొన్ని ఉత్పత్తులకిచ్చే రాయితీలు, సబ్సిడీలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధికి దారి తీస్తాయి. ప్రభుత్వ వ్యయంలో ఉత్పాదక వ్యయ నిష్పత్తి ఎక్కువైతే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. కోశ విధాన సాధనాలను ఉపయోగించుకుంటూ ఉపాధి అవకాశాల పెంపుదలకు చర్యలు తీసుకోవాలి. ఆర్థికాభివృద్ధికి పూర్ణోద్యోగిత ఒక సూచిక లాంటిది. ఆర్థికాభివృద్ధి జరగకుండా ఉద్యోగిత సాధ్యం కాదు. వెనుకబడిన ప్రాంతాల్లోని పరిశ్రమలకు పన్ను రాయితీలు, మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రభుత్వ వ్యయం లాంటి చర్యలు ఉద్యోగితను పెంపొందిస్తాయి. ధరల స్థిరత్వం సాధించడం కోశ విధానం లక్ష్యం. ద్రవ్యోల్బణ కాలంలో ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకుంటూ పన్నులు విధించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి తగ్గించాలి. ప్రతి ద్రవ్యోల్బణ కాలంలో ప్రభుత్వ వ్యయం పెంచుతూ బడ్జెట్ రూపొందించు కోవాలి. తద్వారా

వినియోగ ప్రవృత్తి ఎక్కువగా ఉండే వర్గాల్లోని ప్రజల ఆదాయ స్థాయి పెరుగుదలకు చర్యలు తీసుకోవాలి.

## అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కోశ విధాన పాత్ర

అభివృద్ధి చెందిన దేశాల్లో కోశ విధాన లక్ష్యం ఆర్థిక స్థిరత్వం సాధించడం కాగా... ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడం అభివృద్ధి చెందుతున్న దేశాల లక్ష్యంగా ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక పురోగతికి ఆర్థిక స్థిరత్వం ముఖ్యం. ఈ రెండు వ్యవస్థల్లో ఆర్థిక అస్థిరత్వం ఏర్పడినప్పటికీ దీని స్వభావం ఈ వ్యవస్థల్లో వేర్వేరుగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అల్ప ఉత్పత్తి నుంచి ఆర్థికాభివృద్ధి విధానాలను ఫైనాన్స్ చేయడానికి సరిపడే పొదుపు వనరులను సమీకరించడం... వాటితో పెట్టుబడిని విస్తృతంగా ప్రభుత్వం చేపట్టడానికి ఉపకరించే సాధనం కోశ విధానమని ఐక్యరాజ్యసమితి నివేదిక అభిప్రాయపడింది. ఆర్థికాభివృద్ధి సాధించడానికి చేపట్టే పథకాలు, ప్రాజెక్టులకు అవసరమైన విత్త వనరులు సమీకరించాలి. ఈ దేశాల్లో మూలధన సంచయనం తక్కువైనందున పొదుపును నిర్బంధంగానైనా పెంచవలసిన అవసరం ఉంది. దేశీయంగా వినియోగాన్ని తగ్గిస్తూ ఉత్పాదక రంగాల వైపు పెట్టుబడి మళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. పురోగామి పన్ను విధానం అవలంబించడం, ఈ క్రమంలో విలాసవంతమైన వస్తువుల దిగుమతులపై ఎక్కువ సుంకం విధించి తగిన వనరులు సమీకరించాలి. అభివృద్ధికి అవసరమైన వనరుల సేకరణలో పన్ను విధానం ప్రముఖ పాత్ర నిర్వహిస్తుంది. ఈ దేశాల్లో ఆదాయ సంపదల పంపిణీలో అసమానతలు ఎక్కువగా ఉంటాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటురంగ పాత్ర ఎక్కువైనపుడు సామాజిక, ఆర్థిక సమస్యలు తలెత్తి ఆర్థిక అనిశ్చితి పెరుగుతుంది. అసమానతలు ఎక్కువైనపుడు ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. కాబట్టి ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు సరైన కోశ విధానాన్ని రూపొందించి ఆదాయ సంపదల్లోని వ్యత్యాసాలు తొలగించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థికవృద్ధి, ధరల స్థిరీకరణ సాధించడం సంయుక్త లక్ష్యాలుగా ఉంటాయి. ద్రవోల్బణ ఒత్తిళ్లను తగ్గించుకునే విధంగా ఆయా దేశాలు తమ కోశ విధానాన్ని రూపొందించుకోవాలి. ఈ దేశాల్లో ప్రభుత్వ వ్యయం పెరుగుతున్నందున ధరల స్థాయిలో పెరుగుదల ఏర్పడుతుంది. మరోవైపు వినియోగ, మూలధన వస్తువులు పెరుగుతున్న ఆదాయానికి తగినంతగా లభ్యం కాకపోవడంతో ద్రవ్యోల్బణ వ్యత్యాసం ఏర్పడుతుంది. పన్ను విధానం, రుణ విధానం లాంటి కోశ విధాన సాధనాల్ని ఉపయోగించి ద్రవోల్బణం తగ్గించే చర్యలు చేపట్టాలి. దీనితోపాటు ముఖ్యమైన వస్తువుల ఉత్పత్తి పెరుగుదలకు చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెంచడానికి పన్ను రాయితీలు, సబ్సిడీలు, మినహాయింపులు మాత్రమే సరిపోవు. అనుత్పాదక రంగాల్లో పెట్టుబడులపై ఎక్కువ పన్నులు విధించడం ద్వారా వనరులు ఉత్పాదక రంగానికి బదిలీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి తొలి దశలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. ఈ సౌకర్యాలు మార్కెట్ పరిమాణం పెంపుదలకు, ఉత్పత్తి వ్యయం తగ్గుదలకు, సాంఘిక ఉపాంత ఉత్పాదక పెట్టుబడుల పెరుగుదలకు దారి తీసి ప్రైవేటురంగ పెట్టుబడులు పెరగడానికి దోహదపడతాయి. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల తగ్గించడానికి ఈ దేశాలు ప్రభుత్వ వ్యయం తగ్గించుకోవడం, పన్ను రేట్లను పెంచడం, ప్రభుత్వ రుణం పెంచడం లాంటి విధానాల ద్వారా కోశ విధానాన్ని పాటిస్తాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలు వృద్ధిని సాధిస్తున్న కొద్దీ వ్యయం పెరుగుతుండటంతో విత్త వనరుల సమీకరణ విస్తృతి, పరిధి పెరుగుతుంది. అందువల్ల రుణ విధానాన్ని ఈ దేశాలు అత్యంత శక్తిమంతమైన కోశ విధాన సాధనంగా ఉపయోగిస్తున్నాయి. వ్యయ విధానం, పన్ను రాబడి, రుణ విధానం, రుణ నిర్వహణ లాంటి విధానాలు ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా మంచి ఫలితాలు సాధించే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలి. కోశ విధానం మార్కెట్ వ్యవస్థ పనితీరును నియంత్రిస్తుంది.

అల్పాభివృద్ధి దేశాల్లో ఆర్థికాభివృద్ధిని సాధించే కోశ విధాన ప్రక్రియ ప్రభుత్వమే పెట్టుబడిదారునిగా, స్థిరీకరణ దారునిగా, పొదుపరిగా, పునఃపంపిణీదారునిగా ఉంటుందని కీన్స్ అభిప్రాయపడ్డారు. కోశ విధాన సఫలత ఆయా దేశాల్లోని పరిస్థితులు అంటే స్థిరత్వం, మార్కెట్ శక్తులు, కోశ సాధనాల సరైన వినియోగం, విదేశీ మూలధన, వ్యాపార పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 'క్రియాశీలక విత్త విధానం' ద్వారా వనరులు సమీకరించి ఆర్థిక వృద్ధిని, స్థిరత్వాన్ని సాధించవచ్చు. ఈ దేశాలు తమ లోటు విత్త విధానాన్ని కేంద్ర బ్యాంకు నుంచి రుణాలు పొందడం ద్వారా చేపడతాయి. సాధారణ రెవెన్యూ రాబడి కన్నా వ్యయ అవసరాలు ఎక్కువైనపుడు ఈ విధానాన్ని అవలంభిస్తాయి.

## ప్రాక్టీస్ బిట్స్

1. రాష్ట్ర ప్రభుత్వాల రుణాల్లో ఏ రుణం ఎక్కువ
   – మార్కెట్ రుణం
2. తటస్థ పన్ను విధానం అవలంబించాలన్నది
   – సంప్రదాయ ఆర్థికవేత్తలు
3. 'ద జనరల్ థియరి ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్, ఇంట్రస్ట్ అండ్ మనీ' గ్రంథకర్త
   – జె.ఎం. కీన్స్
4. పేద ప్రజలను పన్ను విధింపు నుంచి 'ధార్మికంగాను, ఆర్థికంగాను' మినహాయింపు ఇవ్వాలన్నది
   – జె.ఎం. కీన్స్
5. న్యాయసమ్మతం కానటువంటి అసమానతలు తొలగించాలన్నది
   – ఆర్.ఎన్. త్రిపాఠి
6. మూలధన వస్తు పరిశ్రమలపై ప్రభుత్వ వ్యయం ఎక్కువైతే అసమానతలు పెరుగుతాయన్నది
   – కె.ఆర్. రణదేవ్

7. సాంఘిక, కమ్యూనిటీ సేవలపై వ్యయం

   – అభివృద్ధి వ్యయం

8. రక్షణ రెవెన్యూ వ్యయం, వడ్డీ చెల్లింపులపై వ్యయం

   – ప్రణాళికేతర వ్యయం

9. రెవెన్యూ లోటు = రెవెన్యూ వ్యయం

   – రెవెన్యూ రాబడి

10. ప్రాథమిక లోటు = ద్రవ్య లోటు

   – వడ్డీ చెల్లింపులు

11. లోటు విత్త విధానాన్ని సమర్థించింది

   – జె.ఎం. కీన్స్

12. బిగ్ పుష్ విధానం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించ వచ్చున్నది

   – బెంజిమిన్ హిగ్గిన్స్

13. ఉపాంత పొదుపు ప్రవృత్తి అభివృద్ధిని నిర్ణయించే కీలక అంశమని చెప్పింది

   – నర్కేస్ (Nurkse)